# ★ పాత్ర పరిచయం! ★

[ కథకుడు: కె. గంగాధరాచార్య ]

ప్రెసిడెంటు కొండ్రాయుడిది హిరణాక్ష్యరూపం!

పెద్దకత్తుల్లాంటి ఆవంకరతిరిగిన మీసాలూ, ఆముడితలా, వినాయకుని బొజ్జలాంటి పెద్దగంగాళం లాగుండే పొట్టా, నల్లని నేరేడుపండువన్నె శరీరఛాయా, పెద్దలావుపాటి దూలాల్లాంటి తొడలూ-కండచే మూశేసిన చిన్నకళ్లూ, బొడ్డుక్రింద పంచెకట్టూ—చేతులో ఓలావుపాటి దుడ్డుకర్ర,—యివీ రాయుడి ఆకారచిహ్నాలు! నలభైయేళ్లకుమించిన వయస్సుంటుంది. మాట్లాడితే నల్దిశలూ ఖంగుమని మ్రోగుతాయ్! కొండ్రాయుడంటే జిల్లామొత్తం మీద ఎరగనివాళ్లేరు. రాయుడికి కలియుగ హిరణ్యాక్షుడని బిరుదుకూడాను!

కొండ్రాయుడు బాగాడబ్బూ, పలుకుబడీ గల రైతుబిడ్డ. ఏః ధాటీగా—పోటీలేకుండా—ప్రెసిడెంటయ్యాడు జిల్లాబోర్డుకు.

రాయుడికి నలుగురన్నదమ్ములు. అంతా భాగాలై, ఎవరిముట్టుకువారు—వేరేవుంటున్నారు. రాయుడికి యిద్దరుకొడుకులూ, యిద్దరు కూతుళ్లూను. అందరికీ—పెళ్లిళ్లుచేశాడు వైభవంగా! రాయుడు వాటాకొచ్చిన బంగళాలోని సావిట్లో—ఎప్పుడూ పదిబెంచీలూ కుర్చీలూపడివుంటాయ్! వాళ్లూవీళ్లూ వస్తూవుంటారు ఎప్పుడూను! ఆబంగళాముందు క్రోటన్సుమొక్కలు పూలమొక్కలు బారుగా, బంగళా గేటువరకూ వెళ్లే చిన్నరోడ్డుకు రెండువైపులావున్నయ్! పూలమొక్కలమధ్యను సిమెంటు రాళ్లు కూర్చోడానికి వున్నయ్! అది పల్లెటూరవటం వల్ల తెనుగుపత్రికలు చదవడానికి వస్తారు చాలామంది! రాయుడిగారి బంగళాకు మధ్యాహ్నం మొదలు పొద్దుపోయేవరకూ పత్రికలు చదివేవాళ్లూ, వినేవారూ తెంపుండరు! మొత్తంమీద రాయుడిగారి బంగళా ఎప్పుడూ సందడిగానే వుంటుంది. ఆవూళ్లోకల్లా అంతగొప్ప అందమయిందినీ, ఇక దాన్ని మించిందీని లేనేలేదు!

రాయుడు మాంచి రసికాగ్రేసర చక్రవర్తి! ప్రొద్దున్నే చూచాడంటే ఆసాయంత్రంలోగా ఎలా అయినాసరే కలుసుకోవాలి; లేకపోతే ఆవేళకు నిద్రేపట్టదు. ప్రొద్దున్నే అలా బహిర్భూమికి వెళ్లి వచ్చేదార్లో, మంచినీళ్ల చెఱువుగట్టున మకాం వేస్తాడు. నీళ్లకు వచ్చిపోయే ఆడవాళ్లు రాయుడి దృష్టిలోగూడా భ్రమణంచేస్తూంటారు. తను పొద్దునే చూచాడంటే సాయంత్రానికి ఆస్త్రీని ఎల్లాగన్నా-వశంచేసుకుంటాడు తనకు కార్యసాపల్యం చేసే వెంకివల్ల!

రాయుడు, తానుచేసేపనులో మూడోకంటి వానికన్నా తెలియకుండా మసులుతాడు. తనకు కనుపించినదాన్నే మంచిగా వుండేటట్లు చేస్తాడు! పైకిమాత్రం ఎంతోసన్మార్గుడిలా కనుపించేటట్లు రూపిస్తాడు. ఎలాగైనా రాయుడిది తెలివైన బుర్రే! ఆవూళ్లోకూడా ప్రెసిడెంటు కొండ్రాయుడంటే మంచివాడనీ, పెద్దమనిషనీ, న్యాయంగా నడుస్తాడనీ, పేరువుందిబాగా!

'నిజం దేవుడెరుగు, నీరు పల్లమెరుగు' అన్నట్లు రాయుడుచేసేపన్లు రాయుడుకూ కార్యసాఫల్యతకు కర్ణధారిణిఅయిన ఆవెంకికీ, ఆ...స్త్రీలకూ—పైన భగవంతుడంటోడికీ, తెలియాల్సిందేగాని, పైగా పరాయివాడి కెవడికైనాసరే — యీయన నడత తెలియదు. ఏపనిచేసినాసరే, రాయుడుపేరు చలామణి అవుతోంది!—అన్నట్టు మరచాం!--రాయుడుగారికి ఓటూరింగుకారుగూడావుంది!— దాని మీద ప్రెసిడెంటుగారు సర్క్యూట్లు కొడుతూంటారు. ఆకారుడ్రైవరు అప్పలస్వామి రాయుడుగారిమల్లే ప్రైవేటు వ్యవహారాల్లో పైచెయ్యే! రాయుడుతో ట్రావలింగులుకు వెళ్లినప్పుడు—అప్పలస్వామికూడా ప్రైవేట్లు జరుపుతూంటాడు. రాయుడుగారు యెక్కడికివెళ్లినా వెనకాలే, రెండుపెద్ద శింగంగుల్లాంటి కుక్కలుంటాయ్; రాయుడి పెంపుడు కుక్కలవి! వాటిరూపం రాయుడురూపంకంటే భీకరంగా ఉంటుంది!

* * *

ఆవూళ్ళోనే సుందరమ్మ అనే ఆవిడవుంది. ఆవిడకూ మనరాయుడుగారికీ చాలాపరిచయం. అన్ని విషయాల్లోనూ- ఆవిడంటే రాయుడుకు అమితమైన ప్రేమా—చనువూను! సుందరమ్మ మొగుడుతో కాపురం చేసుకొంటుంది; ఇద్దరు పిల్లలూగూడా!

ఇప్పుడామె పుట్టింటికి వెళ్లింది; అక్కడ జబ్బు చేసి ఏడాదిపైగా వుండిపోయింది! జబ్బు నయం అయాక వాళ్లతమ్ముడు పెళ్లి అవడం, వాళ్లఅమ్మచని పోవడం ఇలాంటివి జరగడంవల్ల—ఓసంవత్సరన్నర వరకూ తనుండేవూరు రాలేకపోయింది; ఆమె మొగుడుగూడా తానొక్కడూ యిక్కడెందుకని అత్తగారివూరికేవెళ్లి - ఇక్కడిలాగే కూలిపనిచేసుకొని పావలాడబ్బులు తెచ్చుకుంటూండేవాడు! అలా కొన్నిరోజులు గడిచాక, అమ్మగారివూరినుంచి వాళ్లవూరువచ్చేసింది సుందరమ్మ తన మొగుడూ పిల్లల్తోసహా.

* * *

అది మంచినీళ్లనుయ్యి, గుడిదగ్గర్నే వుంది. ఆవేళ సుందరమ్మ అందంగా తలదువ్వుకొని మల్లెపూలు తల్లోపెట్టుకొని చక్కనిచీరతో, చుక్కచుక్కలరైవికతో ముస్తాబై, నూతికివచ్చి నీళ్లు తోడుతోంది! అప్పుడే సూర్యుడస్తమించాడు. కొంచెం కనుచీకటిగా వుందిగూడానూ! అంతా నిశ్శబ్దంగావుంది. సుందరమ్మ ఒకటి, రెండు, మూడు చేదలుతోడింది; యింకాతోడుతోంది. అంతల్లోకే రాయుడుఒక్కడే అలావస్తూవున్నాడు! వెనుక ఎవరూలేరు అటూఇటూ నల్దిశలూ చూచించి సుందరమ్మ పరాయివాళ్లు ఎవరన్నా వస్తున్నారా అని! ఎవరూ రావడంలేదు రాయుడుదగ్గరగా వస్తోన్నాడు. ఒక్కచిన్న సంజ్ఞగా దగ్గుదగ్గింది సుందరమ్మ రాయుణ్ణి ఆహ్వానించేటట్లూ! రాయుడుకు ఆదగ్గు పరిచయంగలదే! వెంటనే నుయ్యివైపుచూచాడు సుందరమ్మా, ఆ...బిగువైన...ధ్వయంతో చిరునవ్వుతో ఆకనుచీకట్లో చక్కని అప్సరసలాగ గోచరిస్తోంది! రాయుడుకూడా అటూఇటూ చూశాడు ఎవరైనావున్నారేమో అని! దగ్గరకొచ్చి నవ్వుతూ "సుందరమ్మా! ఎన్నాళ్లకు కనుబడ్డావ్!" అంటూ ఆమెను చాలా దగ్గరగావచ్చి సుందరమ్మ భుజంమీద చేతులువేశాడు. రాయుడు చేయిపడడంతోటే ఒళ్లు పరవశమైపోయి, ఆచుక్కచుక్కల రవికలోనుంచి వుబికిన ఆ....ద్వయాన్ని రాయుడు... ఆచూపులు రాయుడుచూపుల్లో మిళితంచేసింది! "చాలారోజులకు కనుపించావ్ సుందరమ్మా!" అని అన్నాడురాయుడు.

నేనూ, అలాకొలకు వెళ్దామని బయలుదేరాను నూతిసమీపానికి వచ్చేసరికి ఇద్దరువ్యక్తులు నిల్చున్నట్లుగా ఆచీకట్లో గోచరించింది! వెంటనే నాచేతులోవున్న బాటరీలైటువేశా!-సుందరమ్మా, రాయుడూ స్పష్టంగా గోచరమయారు రవివర్మ చిత్రాల్లాగ! నూతిదగ్గర నన్నుచూచి, కొయ్యబొమ్మలాగ నిల్చొని చూస్తోంది సుందరమ్మ! రాయుడు కళ్లుపెద్దవిచేసి నావైపు వురిమిచూస్తో కాళ్లు కడుక్కోవాలన్నట్టుగా చేదతీసి నీళ్లు తోడుతూ—వున్నాడు "పాతపరిచయం!" అనుకొని నాలోనేను నవ్వుకుంటో వెళ్లిపోతున్నా నుయ్యిదాటి-ఓయిరవై-పాతికగజాలు వెళ్లేనోలేదో- "ఫెడేల్! ఫెడేల్!"—మనేధ్వనితో దెబ్బల చప్పుడూ, "అమ్మోయ్! అమ్మోయ్!!" అనే కేకలూ వినబడ్డాయ్! గబగబ పరుగెత్తాను. అంతల్లోకే చాలామంది గుమిగూడారు! సుందరమ్మ లేదు!—భీముడుచేతులో చచ్చిన కీచకునిలాగ రాయుడు పడియున్నాడు! సుందరమ్మ మొగుడు రామయ్య నిలబడి రాయునివైపు చూస్తూన్నాడు "తగినశాస్తి" అయిందన్నట్టుగా పంళ్లు పటపట కొరుకుతో!

రామయ్యని నలుగురూ పట్టుకున్నారు రాయుడ్ని లేవదీసి ఇంటికి తీసుకువెళ్ళారు మరో రెండుగంటలు గడిచాక—సుందరమ్మ ఇంటిలో వురిబోసుకుని చచ్చివుందనీ, సుందరమ్మ మొగుడు రామయ్య ఎక్కడకో పారిపోయాడనీ వార్త వూరంతా ప్రాకింది!—

రాయుడు సుందరమ్మ మొగుడు రామయ్య కొట్టిన దెబ్బలవల్ల ఓపదిహేనురోజులు మంచంబట్టాడు-తర్వాత రామయ్యనిగురించి గవర్నమెంటువారికి రిపోర్టుయిచ్చాడు—దొంగతనాలుచేసే గజదొంగనీ ఎక్కడున్నా—అరెస్టుచేయాలని!

రామయ్య ఎక్కడున్నాడో ఇంకా ఎవరికీ తెలీదు!

అంతా పాతపరిచయ ఫలం